విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 24 జూన్ 2025 8 పేజీలు

27 సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని దాసరిభవన్‌లో జరగుతుందని జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై పలు సూచనలు, సలహాలు అందించి నాయకులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఇంతటి ప్రాధన్యత గల సమావేశానికి కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను

ప్రతిఘటించాలి

మోసపూరిత హామీలిచ్చి రైతు, కార్మికులు, యువతను మోసం చేసిన మోదీ
ధ్వజమెత్తిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : కేంద్రంలోని నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలో 11 ఏళ్ల కాలంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, నరేంద్ర మోదీ దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని తిరుపతయ్య మండిపడ్డారు. గత ఎన్నికల ముందు నరేంద్ర మోదీ రైతుల వద్దకు వచ్చి ధర్నా చేస్తుంటే రైతుల సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చి క్షమాపణలు చెప్పి వెళ్లిన నరేంద్ర మోడీ తీరా ఎన్నికల్లో అధికారం చేపట్టిన తర్వాత రైతులను నట్టేట ముంచాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. అదేవిధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం నియంతృత్వ విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ కార్పొరేట్ పెట్టుబడుదారులకు దాసోహం అనేలా కార్మిక చట్టాలను మార్పు చేయడానికి చూస్తుందని, వాటిని కార్మిక సంఘాలు అన్నీ మరో విప్లవాత్మకమైన పోరాటం చేయడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా మృత వీరులకు సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పల్నాడు జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ నియోజవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం బెల్లంకొండ మండలం అభివృద్ధికి పలు తీర్మానాలతో ఆమోదం తెలిపారు. ముందుగా సీపీఐ జెండాను ఎగరేశారు.

నూతన కమిటీ ఎన్నిక: సీపీఐ మండల కార్యదర్శిగా పొన్నూరి వెంకట్రావు, సహాయ కార్యదర్శిగా రాయపూడి జానయ్య, 15 మంది కౌన్సిల్ సభ్యులు మండల కమిటీగా 8 మందిని ఏకంగా ఎన్నికైనట్లు సీపీఐ నియోజవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): యువకులు, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విజయవాడ సెంట్రల్ ఏసీపీ స్రవంతి రాయ్ అన్నారు. సోమవారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సవ్రంతి రాయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగం వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా త్రీవ ప్రభావం చూపిస్తుందని ఆమె అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయం, మత్తు పదార్థాలు సరఫరా పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అందించిన వారి వివరాలు గోప్యంగా -మిగతా 2 లో ...

అలసత్వం వహిస్తే చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: అర్జీల పరిష్కారంలో నాణ్యతకు, సంతృప్తి స్థాయికి ప్రాధాన్యమివ్వాలని, అలసత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోనని పునరావృతం కాకుండా అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం లభిస్తుందని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. వారి -మిగతా 2 లో ...

నల్లధనం అంతా పెట్టుబడిదారులకే

-యువతకు ఉద్యోగాలు కల్పించటంలో మోదీ విఫలం

-పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌లకు దాసోహం అనేలా విధానాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్రంలో నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. సోమవారం మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో సీపీఐ శాఖ మహాసభ జరిగింది. ఈ మహా సభకు సీపీఐ సీనియర్ నాయకులు సుంకర వెంకట రమణారావు అధ్యక్షత వహించారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత నల్లధనాన్ని మొత్తాన్ని తీసుకొస్తానని చెప్పి నల్లధనాన్ని మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకు తరలించిన ఘనుడు మోదీ అని -మిగతా 2 లో ...

మతాల మధ్య చిచ్చుపెట్టడమే నేటి రాజకీయం

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి

విశాలాంధ్ర-కారంపూడి: దేశంలో ఉన్న మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవటమే నేటి రాజకీయ వ్యవస్ద అని సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆదినారాయణ కాలనీ వద్ద మండల సిపిఐ మహాసభ నిర్వహించారు. ఈ మండల మహాసభ పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. సందర్బంగా ఆదినారాయణ స్తూపం వద్ద అరుణపతకాన్ని జిల్లా సహాయ కార్యాదర్శి షేక్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సభలో మారుతి మాట్లాడుతు పేదల, పీడిత ప్రజల అండగా కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని

101వ సంవత్సరములో అడుగు పెట్టబోతున్న ఏకైక పార్టీ భారతకమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో -మిగతా 2 లో ...

రిటైనింగ్ వాల్ అభివృద్ధికి కృషి

వివరాలు 3 లో ...

(మొదటి పేజీ తరువాయి)

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ఉంచుతామని చెప్పారు. ఈ ప్రచారాన్ని మరింత బలపరచడానికి రద్దీ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు కల్పించాలని ఆమె సూచించారు. మత్తు పదార్థాల వినియోగ వ్యసనాన్ని నిర్మూలించేందుకు అందరూ కలిసి పని చేయాలని తెలిపారు. సీఐ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ యువత ఏ రంగంలో ప్రతిభ చాటవచ్చో గుర్తించి అటువైపు ప్రయాణించేలా చూడాలన్నారు. జీవితంలో ఏది సాధించాలన్నా కృషి, పట్టుదల అవసరమని తెలిపారు. యువత కష్టపడే ఆలోచనా విధానం పై దృష్టి పెట్టాలని, మంచివారితో స్నేహం చేయాలని, చెడు అలవాట్లకు బానిసకావద్దని తెలియజేశారు. మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్ విద్యార్థినీ, విద్యార్థులు, స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

నమ్మకానికి మరింత బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశించిన సమయానికి సమస్యలకు పరిష్కారం చూపాల్సిందేనని ఈ విషయంలో ఏ మాత్రం అలసత్వం వహించినా సహించబోనని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. మానవతాదృక్పథంతో సానుకూలతతో సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలన్నారు. స్వీకరించిన అర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఇకపై అర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్ష నిర్వహిస్తానని అర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 93, పోలీస్ శాఖకు 22, విద్య 12, ఎంఏయూడీ 10, అటవీ 5, పంచాయతీరాజ్ 5, సర్వే 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 4, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్ 3, హౌసింగ్ 3, గ్రామీణ నీటి సరఫరా 3, వ్యవసాయం 2, సహకార శాఖ 2, విభిన్న ప్రతిభావంతులు 2, డీఆర్‌డీఏ పీడీ 2, ఉపాధి హామీ 2, హెల్త్ 2, విద్యుత్, పౌరసరఫరాలు, కళాశాల విద్య, డ్వామా, మత్స్య, జలవనరులు, కేడీసీసీ సీఈవో, కార్మిక శాఖ, బ్యాంకు, గనులు, ఆర్ అండ్ బీ, సాంకేతిక విద్యకు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 189 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అర్జీల స్వీకరణలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహేశ్వరరావు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టడమే నేటి రాజకీయం

కమ్యూనిస్టులు ప్రాణాలను పణంగా పెట్టారని, దీపాంతర శిక్షలు అనుభవించార న్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మతస్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ, జీవించే స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. మనిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు జరిగితే మోడీ స్పందించలేదన్నారు. దేశం అధికధరలతో అతలాకుతలమవుతు ందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతు పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఆదినారాయణ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. పల్నాడు ప్రాంతంలో ఫ్లోరిన్ సమస్యతో పల్లెలు అల్లాడుతుంటే మంచినీటి కోసం సాగర్‌డ్యామ్ నిర్మాణం చేపట్టాలని ఆనాడి సిపిఐ పోరాటం చేసి సాధించిందన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని ఆయమ డిమాండ్ చేశారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మండలమహాసభ ఏర్పాటు చేశామన్నారు. 2004లో సీపీఐ ఎంపిలో మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. పేదల కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేశామన్నారు. వాటి యొక్క నిధులు నేడు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతు నీతి నిజాయితీకి మారు పేరు కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. పేద ప్రజలకు సేవ చేయడంతోనే సంతృప్తిగా భావిస్తారన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఉలవపూడి రాము మాట్లాడుతు బూర్జువ పార్టీలు ఓట్లకోసం మాత్రమే పని చేస్తారని, కమ్యూనిస్టులుపేద ప్రజలకోసం జీవితాలను త్యాగం చేస్తారన్నారు. ప్రభుత్వ పథకాలకు కరెంటు బిల్లును బూచిగా చూపి అనర్హులుగా ప్రకటించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి షేక్ సైదా, మాచర్ల పట్టణ కార్యదర్శి బాబురావు, బాబురావు, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఏక్ నాగమణి, మండల సహాయ కార్యదర్శులు కె వెంకటశివయ్య, చిన కోటిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి జింకల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లధనం అంతా పెట్టుబడిదారులకే

ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, యువతకు రెండు కోట్ల ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తానని నిరుద్యోగ యువతను నరేంద్ర మోడీ మోసం చేశారని ఆయన మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సంవత్సరంలో పార్టీ మహాసభలు జరుపుకోవడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. ముందుగా మృత వీరులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ శాఖ మహాసభలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, సీపీఐ సీనియర్ నాయకులు జవ్వాది సాంబశివరావు, సైకం శివయ్య, జవ్వాది వీరయ్య, షేక్.జాన్ సైదా, నెంబర్ బాజీ, లంబా బాజీ, కృష్ణ, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, సుబ్బారావు, గుడిమెట్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

లాభాలు కాంట్రాక్టరుకు...

కార్మికులకు శ్రమ దోపిడీ

-కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే ఇప్పించండి
-కలెక్టర్‌కు ఆర్‌డబ్ల్యుఎస్ కోఆపరేటివ్ సొసైటీ విజ్ఞప్తి..

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ రంగ గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకం మైలవరం పైలెట్ ప్రాజెక్టులో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులకు నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే ఇప్పించాలని పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ లేబర్ కాంట్రాక్టు కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు జి రాము కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు లేబర్ విధానాన్ని రద్దు పరచి అదే పనిలో గత రెండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న కార్మికులకు కొద్దిపాటి వేతనాలను నెలలు తరబడి పెండింగ్‌లో పెడుతున్నం దున తమ కార్మిక కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతి క్రింద కట్టుబానిసలుగా కార్మికులు శ్రమిస్తున్నారని, లాభాలు కాంట్రాక్టరుకు, పుటగడవని కష్టాలు తమకన్నారు. కాంట్రాక్టరుగానీ, సిబ్బంది గానీ తమ దగ్గర ఉండరని, ఎన్ని కష్టాలు ఎదురైనా రెయింబవళ్ళు శ్రమిస్తూ 104 గ్రామాలకు త్రాగునీరందిస్తున్నామని తెలిపారు. కానీ అతి తక్కువ వేతనాలతో అర్ధాకలితో తమ కుటుంబాలు అలమటిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. అందుకే ప్రస్తు కాంట్రాక్టర్ నుండి తమకు రావలసిన మూడు నెలలు వేతన బకాయిలు, గత 3 సంవత్సరాలు ఇవ్వవలసిన 5శాతం బకాయిలతో సహా ఇప్పించాలని కోరారు. ఈ సంవత్సరంకు సంబంధించిన మెయింటెనెన్స్ వర్క్సు తమ సొసైటీకి నామినేషన్ పై ఇప్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : డీఆర్ఓ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం డీఆర్ఓ కె. చంద్రశేఖర రావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, అదనపు ఎస్పీ సత్యన్నారాయణ, ఆర్‌డిఓ కే.స్వాతి మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో కోర్టు దిక్కరణ కేసులు, జలవనరుల శాఖ పరిధిలో6, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 17 పెండింగ్ లో ఉన్నాయని, వాటికి వకాలత్‌లు వెంటనే దాఖలు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో 146 అర్జీలు అందాయని, ప్రజల నుండి అందుతున్న అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవా లని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖర రావు జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కన్నమనాయుడు, పంచాయితీరాజ్ ఎస్ఈ రమణరావు, రహదారులు, భవనాలు ఆర్డబ్ల్యుఎస్ ఈఈలు లోకేషన్, నటరాజు, డీఎంహెచఓ డా. శర్మిష్ఠ, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర రావు, మార్కెటింగుం ఏడి నిత్యానందం, ఉద్యాన అధికారి జ్యోతి, మున్సిపలు కమిషనరు బాపిరాజు, గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడ్డ కూటమి ప్రభుత్వం : మంత్రి ఫారుక్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ అన్నారు. సోమవారం సూఫీ మత గురువులు, హజ్రత్ సయ్యద్ షాబూఖారీ ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా మంత్రి ఫారుక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కాపాడాలని మంత్రిని ఆయన కోరారు. అల్తాఫ్ బాబా. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి ఫారుక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. వారి సంక్షేమానికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు ఫారూఖ్ షుబ్లీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు బ్యాగులు,షూస్

విశాలాంధ్ర-కూచిపూడి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్టూడెంట్స్ మిత్ర కిట్స్ పంపిణీలో భాగంగా సోమవారం విద్యార్థులకు అందజేశారు. మొవ్వ మండలంలోని 47 ఎలిమెంటరీ పాఠశా లలు, రెండు యూపీ పాఠశాలలు, 9 జెడ్పీ స్కూల్స్, ఒక ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 2,730 మంది విద్యార్థులకు అవసరమైన బూట్లు, బ్యాగులు మొవ్వ లోని పి యం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లోని మండల స్టాక్ పాయింట్ నుంచి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి అందజేశారు. ఈ పంపిణీలో సీ.ఆర్.పి.లు సిహెచ్ శ్రీమన్నారాయణ, సిహెచ్ నాగరాజు, సి.హెచ్. నాగహిమజ, పి.కృష్ణార్జునరావు, డీఈవో టి మురళీకృష్ణ, ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్ గొర్రిపర్తి శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ రాజారావుకు సతీ వియోగం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యా రంగ ప్రముఖులు బెజవాడ రాజారావు సతీమణి తవ్వా కనకదుర్గా వరలక్ష్మీ మృతి చెందారు. ఆమె, భర్త బెజవాడ రాజారావుతో కలిసి విద్యాధరపురంలో బెజవాడ రాజారావు హైస్కూల్ స్థాపించడం, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో గ్రేడ్-1 తెలుగు పండిట్‌గా పని చేసి విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. ఆమె మృతదేహాన్ని విద్యారంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వర రావు, మహిళా సమాఖ్య నాయకురాలు పంచదార్ల దుర్గాంబ, మాజీ కార్పొరేటర్ రమణబాబు, శ్రీ తెల్రపోలు రాజా హైస్కూల్ కరస్పాండెంట్ రూపేశ్వర గుప్తా, ఎస్‌డీయం వైఆర్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ వైఎస్‌కే కిషోర్, డాక్టర్ కొడాలి జయ రమేష్, సైకాలజిస్ట్ డాక్టర్ గర్రె శంకర్, నగర పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్‌కేవీవీ హిందూస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

ఫణికుమార్‌కు ఎమ్మెల్యే మండలి నివాళులు

విశాలాంధ్ర-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో ఇటీవల కృష్ణానదిలో ప్రమాదవశాత్తు పడి మరణించిన ఆత్కూరి ఫణికుమారుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం నివాళులర్పించారు. తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షులు తుమ్మల చౌదరీబాబు, రాష్ట్ర తెలుగు యువత నాయకులు, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), అచ్చంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, శ్రీకాకుళం ఉపసర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, గ్రామ జనసేన అధ్యక్షులు కొండవీటి నాని, జనసేన నాయకులు కొండవీటి కృష్ణమూర్తి, మాదాసు వినయ్, డీసీ వైస్ చైర్మన్ సుగ్గున రాంబాబు, మాజీ ఎంపీటీసీ సీతారామరాజు, కటారి తాతయ్య, కొండవీటి శ్రీనివాస్, సుగ్గున పవన్ కుమార్, జిల్ల శ్రీనివాస్, డాంగే కుమార్, నాగేశ్వరరావు మరియు ముదిరాజ్ యువత తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్డీయే కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుంది. తూర్పు నియోజకవర్గం కృష్ణలంక ప్రాంతంలోని ప్రజలు జాతీయ రహదారిని దాటేందుకు ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి కృషి చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం కృష్ణలంకలోని రాణి గారి తోట, సత్యం హోటల్, అమెరికన్ హాస్పటల్ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశా లతో ఎంపీ కేశినేని శివనాథ్ పర్యటించారు. ఎన్. హెచ్.ఏ.ఐ , ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో మాట్లాడి చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. అలాగే 21వ డివిజన్ ఆర్మీ రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ ను సందర్శించారు. ఆ ప్రాంతం నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు డెవలప్మెంట్ చేసి వాకింగ్ ట్రాకింగ్ నిర్మించే అంశంపై కలెక్టర్ లక్ష్మీశా తో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

రామ్మోహన్ చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ త్వరలోనే రాణిగారితోట, అమెరికన్ హాస్పటల్ ప్రాంతాల్లో వెహికల్ అండర్ పాస్ నిర్మిస్తామన్నారు. అలాగే 21వ డివిజన్ ఆర్మీ రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు కరకట్టపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామని, ఇందుకు సంబంధించి పరిశీలన చేసేందుకు ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులతో కలిసి ప్రాంతానికి రావటం జరిగిందన్నారు. అమరావతి రాజధానికి ముఖద్వారమైన విజయవాడను అభివృద్ధి చేయటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నివసించే వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో 2014లో ముఖ్యమంత్రి గా వున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూ. 500 కోట్ల రూపాయలతో అంచనాలతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదలైన సంగతి అందరికీ తెలిసిందే..రక్షణ గోడ నిర్మాణం వల్ల మురుగు నీరు నిల్వ వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఏ.ఐ పి.డి విద్యాసాగర్, ఎన్.హెచ్. విజయవాడ ఈ.ఈ సంజీవ్ రాయుడు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎస్.ఈ. మోహనరావు, ఈ ఈ.రవికిరణ్, డి.ఈ. గోపినాథ్, వి.ఎమ్.సి. సి.సి.పి సంజయ్, అడిషనల్ కమీషనర్ చంద్రశేఖర్, ఎ.సి.పి మోహన్ బాబు, ఈ.ఈ. ప్రామాజ్యం, జోనల్ కమీషనర్ షమీ, సి.సి.శ్రీనాథ్ రెడ్డి, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, లతోపాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ నిఘా

విశాలాంధ్ర-కంకిపాడు : అసాంఘిక కార్యక్రమాలు జరిగే సమస్యాత్మ ప్రాంతాల్లో డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ మురళికృష్ణ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్దూరులోని కరకట్ట ప్రాంతాలలో కోడిపందాలు, పేకాట అసాంఘిక ప్రదేశాలను పరిశీలించారు. ఎస్ఐ సందీప్, అదనపు ఎస్ఐ తాతచార్యులు, మద్దూరు కరకట్ట వద్ద డ్రోన్‌తో అసాంఘిక ప్రదేశాలను పరిశీలించారు.

ఇంద్రకీలాద్రి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

విశాలాంధ్ర-విజయవాడ (ఇంద్రకీలాద్రి): ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వారి ఆలయంలో అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్ పై సమీక్ష సమావేశం జరిగింది. ఆనం రామ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని), దేవాదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, కమిషనర్ రామచంద్రమోహన్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మౌలిక వసతుల అభివృద్ధి పై దృష్టి సారించామన్నారు. మరో పూర్తి స్థాయి సమీక్ష జరిపి మాస్టర్ ప్లాన్ అమలు పై ముందుకు సాగుతామని తెలిపారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి అభివృద్ధికి ఈ ప్రభుత్వం తీసుకున్న చర్యలు చరిత్రలో నిలిచిపోతాయని, 50 సంవత్సరాల వరకు తిరిగి చేసే పనిలేకుండా ఏర్పాట్లు చేయబోతున్నామన్నారు. సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ప్రసాద్ పథకం పై త్వరలోనే శుభ వార్త చెబుతామన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో శీనా నాయక్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : రైతులు

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలం పరిటాల పరిధిలోని కావేటి వాగుపై నాగార్జునసాగర్ కాలువల ఆక్రమణలను తొలగించి ప్రజలకు సాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పరిటాల గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం కంచికచర్ల తాహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. పరిటాల గ్రామ రెవెన్యూ పరిధిలో 317, 326, 327 సర్వే నెంబర్ల పరిధిలోని కాచేటి వాగుపై ఉన్న రోడ్డును తొలగించి వాగును పునర్నిర్మించాలని, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతుల కోరారు. కాచేటి వాగును రహదారిగా మార్చడం వల్ల భూ ఉపరితల నికర ముట్టడి తగ్గుతుందని, గ్రామ ప్రజలకు నీటి వనరులపై ప్రభావం పడుతుందని, పశుపక్షాదులు మరణించే ప్రమాదం ఉందని ముఖ్యంగా పర్యావరణానికి నష్టం జరుగుతుందని రైతులు తెలిపారు. కాలువపై ఆక్రమణలను తొలగించి పూర్వపు స్థితికి తీసుకురావాలని, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు విన్నవించారు. గ్రామానికి చెందిన బోడిపుడి వెంకట రామారావు, ఆకుల నరసింహారావు, బండ్ల నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరావు తదితర రైతులు తాసిల్దార్ నరసింహారావును కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు.

వెలివోలులో అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిధిలోని వెలివోలు దళితవాడలో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి మహిళ కట్టుబట్టలతో మిగిలిం ది. ఒంటరిగా నివసిస్తున్న కొడాలి జాన్సీ వంటలకు కూరగాయలు తరిగేందుకు కూలీగా వెళుతూ ప్రతిరోజూ మాదిరిగా సోమవారం ఉదయం పనికి వెళ్లిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ఒంటినిట్టాడి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న మొవ్వ అగ్నిమాపక అధికారులు సంఘటనా ప్రదేశానికి వచ్చి మంటలను వ్యాప్తిచెందకుండా అదుపుచేశారు. ప్రమాదనష్టం రూ.3 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

శ్రీనివాసరావుకు మాతృవియోగం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు పెనుమూడి శ్రీనివాసరావు మాతృమూర్తి వెంకటేశ్వరమ్మ (75) అనారోగ్యంతో సోమవారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, టీడీపీ నేతలు మేకా వెం కటేశ్వరరావు, వేమూరి రమేష్, మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు వెంకటేశ్వరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు.

వీఎంసీ ఫిర్యాదుల పరిష్కార వేదికలో 16 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 16 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రతి ఫిర్యాదుదారుని ఫిర్యాదును అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వత పరిష్కారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరావతి జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

ఆర్ఐఓకు ఏఐఎస్ఎఫ్ నేతల వినతి

విశాలాంధ్ర-పటమట: నగరంలోని బెంజి సర్కిల్ సమీపంలో నిబంధనలకు విరుద్ధం నిర్వహిస్తున్న అమరావతి జూనియర్ కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు ఉమ్మడి కృష్ణాజిల్లా ఇంటర్ ప్రాంతీయ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల వలరాజు, ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్ మాట్లాడుతూ అమరావతి(13069) జూనియర్ కళాశాలకు ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ఆ కళాశాలకు ఏమాత్రం ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు లేకుండా అనుమతులు ఇచ్చేశారని. ఈ కళాశాల కమర్షియల్ బిల్డింగ్ లో 4 అంతస్తుల్లో నడుపుతున్నారని, ఫైర్ సేఫ్టీ లేదు , ఫ్రీ ఎగ్జిట్ లేదని, ఏదైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే ఫైర్ ఇంజన్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్న ఇలాంటి కళాశాల గుర్తింపును వెంటనే రద్దు చేసి విద్యార్థులకు రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఆర్ఐవో సానుకూలంగా స్పందించి వెంటనే తనిఖీలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాదిక్ బాబు, ఉమాకాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: క్రీడాకారులను ప్రోత్సహించాలని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరావు అన్నారు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించుటకు కొడాలి కిషోర్, కొడాలి నాగమల్లి జ్ఞాపకార్థం వారి సోదరుడు కొడాలి కోటేశ్వరరావు సాఫ్ట్ బాల్ కిట్లును ఇచ్చారు.

దస్తావేజు పోయినవి

కంభంపాటి సావిత్రి భర్త కంభంపాటి బాలకృష్ణ డోర్ నెంబర్ 23-26-22, సుమానం వీధి సత్యనారాయణపురం విజయవాడ సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్స్ నెం. 2536/2001, మరియు 4610/2007,కి సంబంధించి మెమోరాండం టైటిల్ డీడ్ ఒరిజినల్స్ ది.09-05-2025 నాడు ఆటోలో మా ఇంటివద్ద నుండి పుష్పా హోటల్ మీదుగా సివిల్ కోర్టుకు వెళుచుండగా మార్గమధ్యలో పోయినవి. కావున వీటికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు.

9849617602, 7981603769

ది స్వర్ణ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

(G.No.3054)

ప్రధాన కార్యాలయము, స్వర్ణలోక్ కాంప్లెక్స్, గవర్నర్‌పేట, విజయవాడ-2. ఫోన్:2572741

మహాజనసభ (2025-2026సం।।) మీటింగ్ నోటీసు

ది స్వర్ణ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3054, విజయవాడ యొక్క 2025-2026 సం।।పు మహాజనసభ ది.06-07-2025 ఆదివారం ఉదయం 11.00 గం।।లకు M-హోటల్, రింగ్‌రోడ్, విజయవాడ నందు ఏర్పాటు చేయడమైనది. కావున బ్యాంక్ 'A' తరగతి సభ్యులు అందరూ సమావేశమునకు హాజరు కావలసిందిగా కోరడమైనది.

(పాలకవర్గ అనుమతితో)

విజయవాడ
23-06-2025

Sd/-
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

దశాబ్దాల సమస్య...దారి చూపరూ...!

ఎమ్మెల్యే కొలికపూడికి వేడుకోలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్య పరిష్కరించాలని పలువురు నేతలు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కోరగా, స్పందించిన ఆయన ఈ రోడ్డులో పర్యటించి, వివరాలు తెలుసుకున్నారు. స్థానికంగా పలు ప్రైవేటు కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు ఎమ్మెల్యే కొలికపూడి సోమవారం విస్సన్నపేట వచ్చారు. స్థానిక ఏడవ వార్డు సభ్యుడు అనుమోలు శివబాజి చొరవ తీసుకుని విస్సన్నపేట పట్టణంలో ప్రధాన వినియోగ రహదారిగా ఉండి, ఏళ్ల తరబడి పట్టించుకోని విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి కొత్తపేట, పంచాయతీ కార్యాలయం, వికాస్ పాఠశాల మీదుగా రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ఉన్న రహదారి గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని వివరించారు. ప్రధాన సెంటర్లుగా ఉన్న గాంధీబొమ్మ, అంబేద్కర్ సెంటర్ల మధ్య ప్రధాన రహదారిలో అవాంతరాలు కలిగితే రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డు మాత్రమే అందుబాటులో ఉంది. పంచాయతీ పరిధిలోని నాలుగైదు వార్డుల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి అభివృద్ధికి చొరవ తీసుకోవాలని బాజి కోరగా, ఆయనతోపాటు పలువురు స్థానిక నేతలు సైతం రహదారి ప్రాముఖ్యతను ఎమ్మెల్యే కొలికపూడికి వివరించి, సమస్య పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ఈ రోడ్డులో స్వయంగా పర్యటించి సమస్య తెలుసుకున్నారు. అనంతరం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శివబాజితోపాటు గరిమెళ్ల లోకేశ్వరరావు, మేశపాం నవీన్, మురుగుల ప్రసాద్, నారాయణ(కోవా), పలగాని మాధవరావు తదితరులు రహదారి సమస్య వివరించినవారిలో ఉన్నారు.

వ్యవసాయ డిప్లొమో కోర్సులకు 30 వరకు దరఖాస్తులు

విశాలాంధ్ర-ఘంటసాల : అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు లకు దరఖాస్తులు ఈనెల 30 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్య ప్రియలలిత సోమవారం తెలిపారు. ఈ నెల 30 తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. https://angrau.ac.in www. angrau.ac.in సందర్శించాలని, వివరాలకు 08671 254499 నెంబరును సంప్రదించాలని డాక్టర్ సత్య ప్రియలలిత తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు చెల్లించా లని నిరుద్యోగ భృతి చెల్లించాలని ఇన్చార్జి కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చినట్లు జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షుడు పొలిమెట్ల వంశీకృష్ణ తెలిపారు. సోమవారం పామర్రు సెంటర్ నుంచి మచిలీపట్నం ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు పామర్రు యంపిపి దాసరి అశోక్ కుమార్,వైస్ యంపిపి లు కొడమంచిలి మహేష్ ఆరేపల్లి శ్రీనివాసరావు ఎ.రమాదేవి టి.బోసుబాబు బి.సాంబశివరావు పాల్గొన్నారు.

సౌత్ జోన్ హాకీ పోటీలకు విద్యార్థులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: జెడ్పీ పాఠశాల పమిడిముక్కల విద్యార్థులు సౌత్ జోన్ ఛాంపియన్ షిప్ 2025 హాకీలో పాల్గొనేందుకు బెంగళూరు వెళ్తున్నట్లు హెచ్ఎం యలమంచిలి దుర్గా భవాని తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జూనియర్ బాలుర విభాగంలో ఎస్.కౌశిక్ సిహెచ్.రఘునాథ్ డి.రోహిత్ కుమార్ ఎ.జిగ్నేష్ వి.ఎన్.లోకేష్ బాబు బాలికల విభాగంలో సిహెచ్.హేమ విజయ లక్ష్మి ఎ.ఆరాధ్య జి. శ్రీ లక్ష్మీ ప్రియ జి శ్రీవల్లి పి దేవిశ్రీ బి సాయి మహాలక్ష్మి డి సాయిశ్రీ లు పోటీల్లో పాల్గొనున్నారని వీరందరికీ పి.డి.ఇ.వి. నారాయణ హాకీ లో ప్రత్యేక శిక్షణా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఆర్.సుకన్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని జిమ్మిదింటకుర్రు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ - 2025 కింద ఎంపికైన సందర్భంగా గ్రామాన్ని అభివృద్ధి పరిచే విధానంలో ఎంపీడీవో విమాదేవి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం సోమవారం జరిగింది. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా జమీదింటకుర్రు, చిన్న పారుపూడి గ్రామాలు ఎంపికైనయని అన్నారు. గతంలో ఓడిఎఫ్ గా ప్రకటించబడిన ఈ పంచాయతీలను ప్రస్తుతం ఓడిఎఫ్ ప్లస్ స్థాయికి తీసుకురావడానికి ప్రజలకు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ విషయమై సంబంధిత మండల స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితిని తెలుసుకుని మెరుగైన స్థితి కోసం కృషి చేయాలని ఆ సమావేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షహనాజ్, ఐసిడిఎస్ మండల సూపర్వైజర్ శివ నాగమణి, వెలుగు ఏపీఎం మహంకాళి రావు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, సాగర్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కృష్ణాజిల్లా న్యాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని జిల్లాకోర్టు నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయవాదులు పాల్గొని మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ సమాజంలోని కొన్ని అసాంఘిక శక్తుల వలన యువత తప్పుదారి పట్టి మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, వారి తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి భవిష్యత్తును అందించడానికి కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి. రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు, ఇతర న్యాయమూర్తులు, అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురంలో...

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం సహకారంతో అంతర్జాతీయ మాధకద్రవ్య వ్యతిరేఖ దినోత్సవం పురస్కరించుకొని మాదక ద్రవ్యాల వినియోగం వ్యతిరేక ప్రచారంలో భాగంగా పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి పాయకాపురం సర్కిల్ వరకు సోమవారం నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే మానవహారాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకాపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదని యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.ధనుంజయ్ నాయుడు మాట్లాడుతూ పూర్తి అవగాహనతో గంజాయి, ప్రతి వ్యక్తి డ్రగ్స్, గంజాయి, కొకైన్ లాంటివి మీ చుట్టుపక్కల వారు విక్రయించినా, వాడుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీసులకు లేదా 1972కి సమాచారం అందిస్తే పూర్తి స్థాయిలో అరికడతారన్నారు, ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు, పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్య మాధురి, ఈగల్ సబ్ ఇన్స్పెక్టర్ యమ్.వీరంజనేయులు, పాయకాపురం సబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరావు, నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్స్ దేవమని, జ్యోతి చంద్రిక, నజ్మా, కె.ప్రియాంక, జాకబ్ రాజు, బి.రమేష్, డి.వెంకటేశ్వరావు, లీలావతి, పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు కె.శేఖర్‌బాబు, ఖాసీం పేరా, కె.అమితకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సిద్ధమే : వక్కలగడ్డ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : వ్యర్థాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అక్టోబర్2 కు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలలో ప్లాస్టిక్ వస్తువులపై పూర్తిగా నిషేధించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయించటాన్ని స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఏ విషయం అయినా సరే ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ,వ్యాపారస్తులు అమలు చేయడం జరుగుతుందన్నారు. తయారీ దగ్గర తయారీదారుడు ప్లాస్టిక్ కవర్స్ లో కాకుండా క్లాత్ కవర్స్ లో పంపే వరకు వర్తకులను బాధ్యులు చేసి కేసులు గాని, మరే ఇతర ఇబ్బందులను కలుగచేయకుండా నివారించగలరు. వ్యాపారస్తులు వారి దుకాణాలలో ,రిటైల్ షాపులలో ఈ ప్లాస్టిక్‌ను వాడకుండా తగు చర్యలు తీసుకుంటారన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారస్తులు పూర్తిగా సహకరించడం జరుగుతుందన్నారు. అందుకని ప్లాస్టిక్ వాడకం నిషేధించాలంటే దాని తయారీ దగ్గరే నిషేధాన్ని అమలుపరిస్తే ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అరికట్టడానికి అవకాశం కలుగుతుందన్నారు.

నాట్య థియరీ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళాపీఠంలో మూడు రోజుల పాటుజరిగేకూచిపూడి నాట్యంలోని సర్టిఫికెట్, డిప్లొమోథియరీ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు పరిశీలకులుగా హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. వెంకట సత్యనారాయణ (జ్యోతిష్య శాస్త్రం) కొనసాగిన ఈ పరీక్షలకు పరీక్ష అధికారులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి (మృదంగం)లు కొనసాగారు. ఈపరీక్షలకుచీఫ్ సూపరింటెండెంట్‌గా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వ్యవహరించారు. కూచిపూడి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు 37 మందికి 31 మంది విద్యార్థులు హాజరైనారు.

బందరుకాల్వకు సాగునీరు విడుదల

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం నిడుమోలు లాకుల వద్ద బందరు కాలువకు సోమవారం సాగునీరు విడుదల చేశారు. రైతులు నారుమడులు పోసుకోవడానికి వీలుగా నీటిపారుదల శాఖ నిడుమోలు సెక్షన్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లిగణేష్, పాల్గొని పురోహితుల వేదమంత్రాలు నడుమ జల పూజ చేసి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు షట్టర్ ఓపెన్ చేసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డి.ఈ అరుణ, నిడుమోలు (పామర్రు) సెక్షన్ నీటిపారుదల శాఖ జె ఈ. సాధిక్, నిడుమోలు లాకు పర్యవేక్షకులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-ఎ కొండూరు : అడుగుకు ఒక గొయ్యి గజానికి ఒక గుంత అద్వాన్నంగా రామచంద్రపురం రహదారి అనే శీర్షికను ఆదివారం విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన సంగతి పాఠకులకు విధితమే. సోమవారం ఆర్అండ్‌బి అధికారులు విజయవాడ భద్రాచలం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంటలకు మరమ్మతులను చేపట్టారు. దశాబ్ద కాలంగా ఈ రోడ్డు నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేసిన అధికారులు రోడ్డు మరమ్మతు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను తాత్కాలికంగా పనిచేయడానికి కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును గ్రామస్తులు, ప్రయాణికులు అభినందించారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామాలుగా పెద్దోగిరాల, ఆకునూరు

విశాలాంధ్ర-ఉయ్యూరు : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 క్రింద మండలంలోని పెద్ద వోగిరాల, ఆకునూరు గ్రామాలను ఎంపిక చేసినట్లు సోమవారం ఎంపీడీఓ జివిస్వి శేషగిరిరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఓపిఆర్డి కోటేశ్వరరావు ఎంఈఓ సుధారాణి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్ రెడ్డి ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజినీ పాల్గొన్నారు.

మెడికల్ అధికారిగా ప్రవీణ

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా జి.ప్రవీణ సోమవారం విధుల్లో చేరారు. 1992 గుంటూరు మెడికల్ కళాశాల బ్యాచ్‌కి చెందిన ప్రవీణ జాగర్లమూడి, పిట్టలవానిపాలెం, చేబ్రోలు, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో పని చేసి సాధారణ బదిలీపై వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వచ్చారు. గ్రామ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని, అవసరమై నచోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రోగులకు సేవ చేస్తానని ఆమె తెలిపారు.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

విశాలాంధ్ర-దాచేపల్లి : నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఓ ప్రయాణికుడు(30) ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందిన ఘటన నడికూడి జంక్షన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. లింగంపల్లి నుంచి నర్సాపూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నడికూడి స్టేషన్‌కు చేరుకునే సమయంలో గేటు వద్ద కూర్చున్న ప్రయాణికుడు జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటుక ఎరుపు గీరల చొక్కా, బుసుగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. గుర్తుతెలియని ఈ మృతుడి సమాచారం కోసం నడికూడి రైల్వే పోలీసుల 8074274484, 9949063960 నంబర్లకు ఫోన్ చేయలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై శ్రీనివాసనాయక్, రైటర్ రామరాజు తెలిపారు.

అమ్మవారి గర్భాలయాలకు స్టీల్ గేట్ల ఏర్పాటు

విశాలాంధ్ర-దాచేపల్లి : శ్రీవీర్ల అంకమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారి గర్భాలయాలకు భక్తులు ఉదయ్ కుమార్, సీతా మహాలక్ష్మీ దంపతులు రూ.లక్ష వ్యయంతో స్టీల్ గేట్లను చేయించి ముఖ ద్వారాల వద్ద ఏర్పాటు చేశారు. తొలుత అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'అతిసారం'పై అవగాహన

విశాలాంధ్ర- ఫిరంగిపురం : ఫిరంగిపురం ఎంపీడీఓ కార్యాలయంలో 'అతిసారాన్ని ఆపండి' అనే కార్యక్రమంపై మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సి.యాని గ్రేస్, డాక్టర్ శ్వేత మాట్లాడుతూ అతిసార వ్యాధి గురించి గ్రామాలలో జులై నెల చివరి వరకు అవగాహనా కార్యక్రమాలు, 5 సంవత్సరాలు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఆరోగ్య కార్యకర్తల ద్వారా పంపిణీ చేయనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షాహేలా నర్గిస్, ఎంపీడీఓ, తహశీల్దార్, సీడీపీఓ, సీహెచ్ఓ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడులు.. వామపక్షాల నిరసన

విశాలాంధ్ర-మంగళగిరి : ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మంగళగిరిలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేసి, మానవహారం చేశారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ఈ దాడులను ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమెరికా ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని విడనాడాలని కోరారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమే కాకుండా పశ్చిమ ఆసియా అస్థిరతకు దారి తీసే విధంగా అమెరికా సైనిక చర్యలు ఉన్నాయని అన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రపంచ మేధావులు పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, సీనియర్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, రంగా, శివ, సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, పట్టణ నాయకులు ఎస్.గణేష్, సీపీఐ ఎంఎల్ నాయకులు కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదవులకే వన్నె తెచ్చిన జవ్వాది



విశాలాంధ్ర-మంగళగిరి : సమర్థవంతంగా నిర్వహిస్తూ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పదవులకే వన్నె తీసుకొస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. పెదవడ్లపూడి గ్రామ టీడీపీ కార్యాలయంలో సోమవారం నూతనంగా యార్డ్ చైర్మన్‌గా నియమితులైన జవ్వాదిని సుందరరావు యాదవ్, దేశం శ్రేణులు ఘనంగా సత్కరించారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. కిరణ్ చంద్ రూరల్ తెలుగు యువత అధ్యక్షునిగా రెండుసార్లు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా పదవులను సమర్థవంతంగా నిర్వహించి ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా పనిచేశారన్నారు. గ్రామంలో మంత్రి లోకేష్ స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజల మన్ననలు పొందారన్నారు. యార్డ్ చైర్మన్‌గా రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రి యేసుబాబు, చింకా కోటేశ్వరరావు, దానబోయిన రామారావు, శంకరరావు, రుద్రు శ్రీను, కాకర్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ 400వ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 400వ షోరూమ్‌ను నోయిడా పట్టణం నందు మల బార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అహమ్మద్ మాట్లా డుతూ అత్యంత విశ్వసనీయ, బాధ్యతాయుతమైన ఆభరణాల బ్రాండ్లలో ఒకటిగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ హోదాను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నెంబర్-1 గ్లోబల్ జ్యూవెలరీ రిటైలర్‌గా పేరుగాంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం రూ.63 వేల కోట్ల టర్నోవర్, 13 దేశాలలో ఉనికి కలిగిన మలబార్ తమ బ్రాండ్ ఆదాయాన్ని రూ.78వేల కోట్లకు పెంచాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 దేశాల్లో..భారతదేశంలోని 22 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో తమ ఉనికిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియా ఆపరేషన్స్ ఎండీ ఆషర్, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెపీ వీరన్‌కుట్టి, గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సలీష్ మ్యాథ్యూ, రిటైల్ ఆపరేషన్స్ హెడ్ పి.కె సిరాజ్, రీజినల్ హెడ్ ఎన్‌కె జిషాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర- పొన్నూరు: పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూల్‌లో 2025 మార్చి 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణంలో నగదు ప్రోత్సాహంతో పాటు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం పి జయకుమార్ అధ్యక్షత వహించారు.పి జ్యోత్స్న శ్రీ, జీవి ప్రవీణ్ ,శ్రీలత లకు రూ.10 వేలు, 6 వేలు,4 వేలు నగదు ప్రోత్సాహంతో పాటు మెమెంటోలు అందించారు. పాఠశాల పూర్వ అధ్యాపకులు కొలను మంగనాధరావు బహుమతులను ప్రధానం చేశారు. ఈ ఏడాది కూడా పాఠశాల ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పూర్వ ఉపాధ్యాయుడు కే.మంగనాధరావు సూచించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు సిహెచ్ నాగ శ్రీనివాసరావు, ఎం.వి గౌతమ్, వి మురళీకృష్ణ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈస్ట్ మ్యాన్ క్లీన్ ఎనర్జీ విస్తరణ

విశాలాంధ్ర/గుంటూరు: ఈస్ట్ మ్యాన్ ఆటో, పవర్ లిమిటెడ్ అనేది ఒక సోలార్ ఎనర్జీ ఉత్పత్తులకు సంబంధించిన తయారీ సంస్థ. అది దాని పాద ముద్రని ఆంధ్రప్రదేశ్ వరకు శక్తివంతమైన లైన్ అప్, అత్యధిక పనితీరు తో సోలార్ ఉత్పత్తులను అందిస్తుంది. మన్నికైన, నిలకడైన శక్తి కోసం పెరుగుతున్న డిమాండ్‌కు సమాధానంగా ఈస్ట్ మ్యాన్ ఇప్పుడు గ్రిడ్ టై ఇన్వర్టర్స్, హైబ్రిడ్ ఇన్వెర్టర్లు, ఆఫ్ గ్రిడ్ ఇన్వెర్టర్లు, లీడ్ యాసిడ్, లిథియం బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్‌ను అందిస్తుంది. వాటన్నటినీ గృహ అవసరాలకు, కమర్షియల్, పరిశ్రమలో వాడుక కోసం తయారు చేసారు. ఈస్ట్ మ్యాన్ ఇన్వర్టర్ రేంజ్ అనేది రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా చెయ్యడానికి తయారు చేసారు. అవి వినియోగదారులకు కావాల్సిన సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కు తిరిగి వెనక్కి పంపించడానికి సహాయపడతాయి. అలా అది ఎలెక్ట్రిసిటీ బిల్స్‌ను బాగా తగ్గిస్తుంది. పచ్చని శక్తి వాడుకకి మద్దతు ఇస్తుంది.

తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. నగరపాలక సంస్థ అధికారులతో కలిసి మా స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రని పాత గుంటూరు, బాలాజీనగర్‌కు చెందిన ఆలా సీతా మహాలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా నాన్నకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, నందివెలుగు రోడ్డులో మాకు 313 గజాల ఆస్తి ఉందని దానిని సమానంగా పంచుకున్నామని తెలిపారు. ఈ మధ్య మా పెదనాన్న ఆ స్థలాన్ని అక్రమంగా వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసాడని, అది కూడా నరసరావుపేట కేంద్రంగా ఈ రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. స్థానిక నగర పాలక సంస్థ సర్వే అధికారులు ఈ స్థలానికి వేరే సర్వే నెంబర్లు కేటాయించారని, దీంతో వేరే ప్రాంతంలో రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. మా తండ్రి చేత వచ్చిన ఆస్తిని మేము వేరే వ్యక్తులకు విక్రయం చేశామని స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎర్రబోయిన సుజాత, చావని రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాఫిట్ షా కంపెనీ చేయూత

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయిలో అత్యధిక మార్పులు సాధించిన విద్యా ర్థులకు ప్రాఫిట్ షా కంపెనీ ప్రోత్సాహ పురస్కారాలను సోమ వారం మంగళగిరి పట్టణంలోని ప్రాఫిట్ షా షాపులో ఎంఈఓ బాబు చేతుల మీదగా అందజే శారు. అనంతరం విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలలో చదివి కార్పొరేట్ పాఠశా లలకు దీటుగా మెరిసిన ఈ విద్య కుసుమాలు సమాజంలో ప్రతిఒక్క రికి ఆదర్శమని అన్నారు. విద్య ద్వారానే సమాజ స్థితిని, గతిని మార్చవచ్చునని ఆయన తెలిపారు. ప్రాఫిట్ షా కంపెనీ అధినేత బివిఎస్ కోటేశ్వరరావు విద్యార్థులకు చేయూ త కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రని ఆయన తెలిపారు. మంగళగి రిలో ప్రథమ స్థానం సాధించిన పి.వరుణ్ సాయి, రెండవ స్థానం సాధించిన జొన్నాదుల స్నేహశ్రీలకు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్క రించి, కాలేజ్ కిట్టును అందజే శారు. మున్సిపల్ హైస్కూల్ పాఠ శాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యా యులు ఏ.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస రావు, ప్రాఫిట్ షా కంపెనీ ఏరియా మేనేజర్ ఎస్‌కే ఖాదర్, జి.కళ్యాణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి కుర్చీల బహుకరణ

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్ర మైన రొంపిచర్ల లో గల అంగన్ వాడీ కేంద్రం లో సోమవారం కుర్చీలను బహుకరించారు. గ్రామానికి చెందిన సరికొండ పద్మ అంగన్‌వాడీ కేంద్రంలో 20 కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మరియ కుమారి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన కుర్చీలు ఇవ్వడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా పద్మను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. అంగన్‌వాడీ టీచర్ బి.లక్ష్మీ, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల టీడీపీ పరిశీలకులుగా రామారావు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని కొనకంచి వారిపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మొండితోక రామారావు శావల్యాపురం మండల టీడీపీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ అధిష్టానం నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన సోమవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధంగా వినుకొండ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు మాజీ ఎంపీపీ మొండితోక రామారావును అభినందించారు. ఈ సందర్భంగా మండలంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ప్రమాదాల నివారణకు ఆధునిక వాహనాలు: ఆర్టీఓ



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జాతీయ రహదారులలో ప్రమాదాలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఆధునిక వాహనాలను ప్రవేశపెట్టి నట్లు ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గుంటూరు ఆర్టీఓ కార్యాలయంలో నంది ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు పెట్రోలింగ్ ఆధునిక వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నెల్లూరు నుంచి తడ..గొల్లపూడి నుంచి నందిగామ వరకు ఐదు, తొమ్మిదో నెంబరు జాతీయ రహదారులలో ప్రమాదాల నివారణకు ఈ వాహనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ వాహనాలు 5, 9 నెంబర్ జాతీయ రహదారులపై నిత్యం అందుబాటులో ఉంటాయన్నారు. నంది ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ ఎండి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన ప్రాంతానికి సకాలంలో వాహనాలు చేరి క్షతగాత్రులకు తగిన వైద్య సేవలను అందించడానికి అంబులెన్స్ ద్వారా కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్ అయినప్పుడు ఆ ప్రాంతం చేరుకొని సమస్య పరిష్కారానికి సిబ్బంది కృషి చేసి పోలీస్ శాఖకు సహకారం అందిస్తారని ఆయన చెప్పారు. సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సౌజన్య, మల్లీశ్వరి వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నంది ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజర్ నడింపల్లి సత్యసాయి పాల్గొన్నారు.

పోరాటాలు కొనసాగించాలి : జంగాల

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పాతగుంటూరు 8వ డివిజన్ సిపిఐ శాఖ 24వ మహాసభ స్థానిక కాలనీలో కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగాల మాట్లాడుతూ, స్థానిక సమస్యలపై పార్టీ కార్యకర్తలు అధికారులను కలవాలన్నారు. ప్రస్తుతం బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ, పేద, అట్టడుగు వర్గాల ప్రజలను ఆకలితో అలమటించే స్థితిలోకి నెట్టుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మత రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడుతూ, ప్రభుత్వ ఆస్తులను తన మిత్రులైన అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నదని మండిపడ్డారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ ప్రబలితంగా మార్చుతున్నదని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం వాయిదా వేస్తూ పక్కనపెట్టిందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీను ప్రైవేటీకరించేందుకు వామపక్షాల పోరాటాలను విస్మరించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో శాఖా మహాసభలు నిర్వహిస్తారన్నారు. నగరంలోని పార్టీ శాఖలను బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కట్టా శ్రీనివాసరావు శాఖ కార్యదర్శిగా తిరిగి ఎన్నుకోగా, ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని కూడా ఎన్నిక చేశారు. అనంతరం సీనియర్ నాయకులు కాయల రామారావుని సన్మానించారు. సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజి బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ భూమిని కాపాడండి

జీవీకి విద్యార్థుల వినతి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణం లోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ విద్యార్థి సంఘ నాయకులు, కాలేజీ విద్యార్థులు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును ఆదివారం రాత్రి కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి మొత్తం 38 ఎకరాలు ఉండగా కొందరు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మహంకాళి సుబ్బారావు వివరించారు. సర్వేనెంబర్ 949 లో ఉన్న డిగ్రీ కాలేజీ భూమి 5.10 ఎకరాలను పట్టణానికి చెందిన కొందరు మా భూమి అంటూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆ భూమిని ప్రభుత్వం వారి వద్ద నుండి తీసుకొని మరోచోట ప్రత్యామ్నాయంగా భూమి ఇచ్చారని వివరించారు. ఆ వ్యక్తులు ఆ భూమిని వదిలేసి కోట్ల రూపాయలు విలువగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తూ అధికారులను ఒత్తిడి చేయడం, రెవెన్యూ అధికారులు వాళ్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ 22(1) ప్రభుత్వ నిషేధిత భూముల జాబితాలో ఉన్న 5.10 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూమిని కొనుగోలు, వారసత్వాల కింద ఆన్లైన్ అడంగల్, వన్ బి లో చేర్చారని తెలిపారు. డిగ్రీ కాలేజీ భూమికి రెవిన్యూ రికార్డులను తారుమార్చేసిన అధికారులపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని జీవీని కోరారు. ఆయన స్పందిస్తూ డిగ్రీ కళాశాల భూమి ఆక్రమణలపై అధికారులచే సమగ్ర విచారణ చేయించి కాలేజీ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుంద శివకుమార్, రాజేష్, డేవిడ్, ఆదిత్య, వాసు, రవి,ప్రభాస్, మస్తాన్ వలి, నాగూర్ వలి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని విజయపురిసౌత్ ఎస్ ఐ డి.అశోక్ అన్నారు. సోమవారం సరిహద్దు ప్రాంతమైన నాగార్జున సాగర్ అంతర్రాష్ట్ర పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా కలిగి లైసెన్స్ లు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని బుల్లెట్ వాహనాన్ని ఆయన సీజ్ చేశారు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

విశాలాంధ్ర-వినుకొండ : శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్ సందర్భంగా సోమవారం కొత్తపేటలోని 188వ బూత్‌లో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వినుకొండ పట్టణ అధ్యక్షులు కోట వెంకట సుధాకర్, వినుకొండ నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ లెనిన్ కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి గొడవర్తి సుజాత, పట్టణ మాజీ అధ్యక్షులు ఆడిటర్ నల్లూరి వీరరాఘవు, ప్రధాన కార్యదర్శి సుధా, గణేష్, దేసు లక్ష్మీనారాయణ, దేవతి చిన నరసింహారావు, అప్పల రాజా, సీనియర్ కార్యకర్త అచ్యుత మూర్తయ్య, శివాది వెంకయ్య, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

మూడో రోజు వంటావార్పు

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక సిపిఐ ఎమ్మెల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మూడవరోజు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి పార్టీ బంగారం మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చట్ట వ్యతిరేకంగా సీలింగ్ ల్యాండ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే సంబంధిత అధికారులు అతనిపై సివిల్ అండ్ క్రిమినల్ కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో భూస్వాములు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తుంటే ప్రభుత్వ అధికారులు గానీ బాధ్యత కలిగిన నియోజకవర్గం ఎమ్మెల్యే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎప్పటికైనా సరే బినామీ పేర్లతో ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసిన భూములు పై ప్రభుత్వం పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ పార్టీ పోరాటాలు చేసి పేదలకు పంచుతుందని అన్నారు. జిల్లా పార్టీ కార్యదర్శి తోట ఆంజనేయులు, ఎమ్మెల్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎంపీ రాందేవ్ పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎస్కే ఫిరోజ్ అధ్యక్షత వహించగా, సంఘీభావంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చిన్న మాల మానాదు నాయకులు విజయ్ కుమార్, యువజన నాయకుడు సుబ్బారావు, పిడిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు తదితరులు ఈ ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు.

పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడిగా వెంకట్ ఎన్నిక

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పట్టణ గౌడ సంఘ అధ్యక్షులుగా యరగాని వెంకట్ (లడ్డు) ఎన్నికయ్యారు. సోమవారం గౌడ సంఘీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పల్నాడు జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు బెల్లం కొండ సైదులు పట్టణ గౌడ సంఘ పెద్దల ఆధ్వర్యంలో పట్టణ గౌడ సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన కమిటీ అధ్యక్షులు యరగాని వెంకట్, ఉపాధ్యక్షులుగా దాసరి నాగరాజు, కర్నూరవు కోటేశ్వర రావు, తెల్ల బాటి మణి, ప్రధాన కార్యదర్శిగా చిలకా శేఖర్, కోశాధికారిగా కట్టా జ్ఞానేశ్వర్‌లను ఎంపిక చేశారు. అలాగే కార్యదర్శులుగా గుండ్ల మురళీకృష్ణ, కొప్పుల సింగరయ్య, యడవల్లి కోటేశ్వరరావు, ఉప్పలపాటి మణికుమార్, మురారి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా యరగాని నాగేశ్వర రావు, చెదురుపల్లి అంకారావు, చెదురుపల్లి శేఖర్, పోతురాజు మల్లి, కారంగుల సాయిలు ఎన్నికయ్యారు. పట్టణ గౌడ సంఘం గౌరవ సలహాదారులుగా పోచమల్ల కొండలు, చెదురుపల్లి శ్రీనివాసరావు, కర్నూరవు వెంకటేశ్వరరావు, ఉసిరికాయల అంకారావు, యడవల్లి కొండలు, యరగాని పున్నారావు, వీరంకి రామకోటేశ్వరరావు, యడ వల్లి సాంబ శివరావును నియమించారు. యూత్ కమిటీ అధ్యక్షులుగా యడవల్లి నవీన్ కుమార్ ను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యరగాని వెంకట్ మాట్లాడుతూ పిడుగురాళ్లలో గౌడ సంఘీయులు సుమారు 250 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో కల్లుగీత కార్మికులుగా, రైతు కూలీలుగా, చిన్న మెకానిక్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి వారి జీవనోపాధికి అవసరమైన సహాయ సహకారం ప్రభుత్వం నుండి అందేలా కృషి చేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు, బ్యాంకు సబ్సిడీ రుణాలు, సొంతిల్లు లేని వారికి ఇంటి స్థలాల పట్టాలు ఇప్పించి రుణ మంజూరుకు ఎమ్మెల్యే యరపతినేని సహకారంతో చేయిస్తానని వివరించారు.

మండల సీపీఐ కార్యదర్శిగా నాగుల్‌మీరా

విశాలాంధ్ర–పెదకూరపాడు : మండల సీపీఐ కార్యదర్శిగా పఠాన్ నాగుల్ మీర, పెదకూరపాడు పట్టణ సీపీఐ కార్యదర్శిగా నేలపాటి ఏసుబాబులను పెదకూరపాడు మండల సీపీఐ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నాగులమీర, ఏసుబాబు ముందుగా జిల్లా పార్టీకి నియోజవర్గ సీపీఐ పార్టీకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని, మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు అండదండగా ఉంటామన్నారు. సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని వారు చెప్పారు.

దేవాలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర– దుగ్గిరాల: కంఠం రాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం నందు సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. మూడు నెలలకు గాను 20 లక్షల 67 వేల 441 రూపాయలు విరాళంగా వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గుంటూరు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణ చేశారు. విరాళాలను ఆలయ అభివృద్ధికి కేటాయిస్తారని తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కోగంటి సునీల్ కుమార్, ఆలయ ట్రస్టీ దేవాభక్తుని రంగప్రసాద్, అర్చకులు తారకనాథ్, మణిశర్మ, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తులు, మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య ఏదైనా.. పోరాడేది కమ్యూనిస్టులే: మారుతి

విశాలాంధ్ర–రెంటచింతల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సమస్య ఏదైనా పోరాటానికి సిద్ధంగా ముందుండేది మాత్రం కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అని మన బాట పూలబాట కాదు... ఎప్పుడైనా పోరుబాట మాత్రమేనని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నందు మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షతన జరిగిన రెంటచింతలలో జరుగుతున్న 16వ మహా సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడి మతసామరస్యాన్ని కాపాడాలని, మైనారిటీల రక్షణకు వారి హక్కులకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తిస్తున్న సంఘ పరివార శక్తులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు

ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను త్వరితగతిన అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కాలం గడిచినా హామీల అమలు మాత్రం నత్తనడకన జరగడం బాధాకరమన్నారు. వయోవృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అర్హులైన వారందరికీ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, ప్రతి నిరుపేద కుటుంబానికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలానికి ఒక వ్యవసాయ గిడ్డంగిని (కోల్ట్ స్టోరేజ్) ఏర్పాటు చేసి రైతులను ఆదు కోవాలని, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో స్థానికులకే అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శీ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నదని, ప్రజల కోసం తమ ప్రాణాలను బలి ఇచ్చిందని, భూమి కోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం ప్రజలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. జూలైలో జిల్లాలో మహాసభలు జరుగుతున్నందున అన్ని శాఖలు మండల మహాసభలు నిర్వహించుకునే కార్యక్రమంలో భాగంగా రెంటచింతలలో మహా సభ విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము,నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి,మాచర్ల టౌన్ సెక్రెటరీ మిద్దెపోగు బాబురావు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలలో పనిచేసే ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర ఛైర్మన్ ఈదులమూడి మధుబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయ ఇంజనీరింగ్ విభాగ కార్మికులు విధులు బహిష్కరించి జీఎంసీ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ప్రభుత్వంలోని సీడీఎంఏకు ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జీతాలు పెంచమని ఎన్నిసార్లు వినతి టపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందించలేదని, ప్రభుత్వం దృష్టికి కూడా ఈ విషయాన్ని వారు తీసుకువెళ్ల లేదని విధి లేని పరిస్థితుల్లో ఈ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు, డ్రైవర్లకు అప్పుడున్న జీతంపై రూ.6 వేలు అదనంగా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని ఇంజనీరింగ్ విభాగంలోని ఇంకా రకరకాల పనులు చేసే కార్మికులకు కమిటీ వేసి ఆ కమిటీ సిఫార్సు మేరకు జీతాలు పెంచుతామని చెప్పి మోసం చేసిందని అన్నారు. ప్రమాదవ శాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యో గం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించా లని, పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, పదవి విరమణ పొందిన వెంటనే కార్మికులకు గ్రాడ్యుటి చెల్లించే విధంగా ఉత్తర్వులు ఇవ్వా లని, వీరిని హెచ్ఆర్ పాలసీ పరిధి లోకి తీసుకురావాలని లేదా మిని మం టైమ్ స్కేల్ ఇవ్వాలని లేదా సీనియారిటీ ప్రకారం సంవత్సరానికి ఆరు పర్సెంట్ ఇంక్రిమెంట్ ఇస్తూ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి యేసు బాబు, సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా స్వయం సహాయక సంఘాల శిబిరాలు

విశాలాంధ్ర–గుంటూరు సిటీ: స్వయం సహాయక సంఘాల సాధికారత లక్ష్యంగా, ఇండియన్ బ్యాంక్ సోమవారం అమరావతిలో మెగా ఎస్‌హెచ్‌జీ క్రెడిట్ ఔట్రీచ్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్లోని అన్ని జోన్లైన అమరావతి, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం మరియు తిరుపతి ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మొత్తం రూ.900 కోట్ల మంజూరు మొత్తాన్ని ప్రకటించింది. మెప్మా టెక్నికల్ కోఆర్డినేటర్ జె.రవికాంత్ స్వయం సహాయక బృంద కార్యక్రమానికి హాజరై ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల అనుసంధానం, ఆర్థిక సాధికారతకు ఇండియన్ బ్యాంక్ యొక్క నిరంతర నిబద్ధతను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివ్ బజరంగ్ సింగ్ ప్రసంగిస్తూ, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించడంలో స్వయం సహాయక సంఘాల కీలక పాత్రను నొక్కిచెప్పారు. స్వయం సహాయక బృంద సభ్యులు, స్థానిక కమ్యూనిటీ ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమరావతి జోన్ జోనల్ మేనేజర్ ఎన్.గౌరీశంకరరావు, విజయవాడ జోన్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్, తదితరులు పాల్గొన్నారు

రైతులకు వెన్నుదన్నుగా బూమ్ ఫ్లవర్ ప్రొడక్ట్

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం : అంతర్జాతీయ మార్కెట్‌లో బూమ్ ఫ్లవర్ ప్రొడక్ట్ వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇది రైతులకు వెన్నుదన్నుగా ఉందనటంలో ఎలాంటి సందేహం లేదని దేవి క్రాప్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్పీ దేష్ ముఖ్, రీజనల్ మేనేజర్ కె. రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. దేవి క్రాప్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధురై–తమిళనాడు ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చిలకలూరిపేట హైవే రోడ్డులో ఉన్న హోటల్ అట్లాంటాస్ నందు బూమ్ ఫ్లవర్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవి క్రాప్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'బూమ్ ఫ్లవర్' అనే కొత్త ప్రోడక్ట్‌ను ఆవిష్కరించారు. అనంతరం లక్కీ డ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ దేష్‌ముఖ్, రవీంద్రనాద్‌రెడ్డిలు మాట్లాడుతూ బూమ్ ఫ్లవర్ ప్రోడక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 35 సంవత్సరాలుగా రైతుల సేవలో నిమగ్నమై ఉందన్నారు. ఈ ప్రోడక్ట్‌ను అన్ని పంటలకు ఎటువంటి నిరభ్యంతరం లేకుండా వాడొచ్చని తెలిపారు. ప్రస్తుతం 18 దేశాలలో ఈ ప్రొడక్ట్ ఎగుమతి రూపంలో అందించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఇతర దేశాలలో కూడా ఈ ప్రొడక్ట్‌ను ఎగుమతి చేయడం జరుగుతుందని చెప్పారు. త్వరంలో మరికొన్ని నూతన ప్రొడక్ట్‌లు రైతుల ముంగిట తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి నష్టాలు, సమస్యలు లేకుండా బూమ్ ఫ్లవర్ ప్రోడక్ట్ గత 40 సంవత్సరాలుగా రైతుల అభివృద్ధిలో వెన్నుదన్నుగా ఉంటూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.లోకనాథన్, స్పెషల్ ఇన్‌వైట్ అంజిరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.శ్రీరామ్, గుంటూరు జిల్లా డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, దేవి క్రాప్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుత్సాహపరిచిన ఏడాది పాలన: లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది కూటమి పాలన రాష్ట్ర ప్రజలను నిరుత్సాహ పరచిందని, ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలో నెట్టిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. సోమవారం రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం 1.6 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15,480 కోట్ల రూపాయల అదనపు భారం విద్యుత్ వినియోగదారులపై మోపిందని, వేలాది బెల్ట్ షాపులతో మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఆరోపించారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ హామీలను ఏమాత్రం అమలు చేయలేదని, ఎస్సీ, ఎస్టి, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, ఇస్తామన్న హామీల మేరకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని పలు అంశాల అమలుకు ఎలాంటి కృషి చేయలేదని, ప్రత్యేక హోదా సాధన మర్చిపోయారన్నారు.

CHANGE OF NAME

I, **CHOWDARY JUGATHARAM** (Old Name), S/o. **HANUMANARAM CHOUDHARY**, Resident of Door No: 23-10-29, 2nd Floor, Venkata Sai Nilayam, Near Sarada Hotel, Broker Bazar, Guntur, Guntur District - 522003, Andhra Pradesh. I have changed my name as **JUGTARAM CHOUDHARY** (New Name) S/o. **HANUMANARAM CHOUDHARY**. Hereafter my name is known as **JUGTARAM CHOUDHARY** (New Name) S/o. **HANUMANARAM CHOUDHARY**.

CHANGE OF NAME

I, **SURINEEDI NAGALAXMI** (Old Name), W/o. **Seethalapu Srinivasa Rao**, Resident of Door No: 12-15-17, Kakumanu Soudha Apts, Kakumanuvari Street, Kothapet, Guntur, Guntur District - 522001, Andhra Pradesh. I have changed my name as **SURINEEDI NAGA LAKSHMI** (New Name) W/o. **Seethalapu Srinivasa Rao**. Hereafter my name is known as **SURINEEDI NAGA LAKSHMI** (New Name) W/o. **Seethalapu Srinivasa Rao**.

మాచర్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు నందు

O.S NO : 196/2020

బిట్వీన్ :
గొబ్బూరి అచ్చయ్య ..... వాది
మరియు
గొబ్బూరి రామాంజనేయులు ..... ప్రతివాది టు
ప్రతివాది యొక్క అడ్రస్ :
గొబ్బూరి రామాంజనేయులు, తండ్రి పున్నయ్య, R/O జమ్మలమడక గ్రామము, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.

పై దావాను శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు కొరకు **ది.25-06-2025** నకు వాయిదా వేసి యున్నారు. మీరు **ది.25-06-2025న ఉదయం 10:30 గంటలకు** పై దావా నందు శ్రీ కోర్టు వారి ముందు, మీరు స్వయంగా గాని, లేక లాయరు గారి ద్వారా గాని, హాజరు పడి మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెనని, ఒకవేళ మీరు హాజరు పడని ఎడల, పై దావాను మీ పరోక్షమున తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : ది.25-06-2025

షేక్ గాలిం సాహెబ్
వాది తరఫు న్యాయవాది, మాచర్ల-522426
సెల్ : 9989125087

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి..

విశాలాంధ్ర-పెదకాకాని : జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పెదకాకాని సీపీఐ కార్యా లయంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. రెంటాల కుమారి అధ్యక్షత వహించగా సీఐ టీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఏఐటీ యూసీ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేలా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శతాబ్దాల కాలం క్రిందట ప్రపంచవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న రోజుకు ఎనిమిది గంటలు పనిచేసే విధానాన్ని కూటమి ప్రభుత్వం 10 గంటలు పని చేయాలని ఆమోదించిన పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 33 మంది యువజన విద్యార్థుల బలిదానాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా నిలువ రించాలని, ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో కలిపి గనులు కేటాయించి పరిశ్రమకు పూర్వవైభవం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, పోస్టల్, ఎల్ఐసీ, ఓడరేవులను ప్రైవేటుపరం చేసి బడా వ్యాపారవేత్తలకు దారాదత్తం చేసే ఆలోచనను విరమించుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని, ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, ఈ-చలానాలు రద్దు చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, జీఓ నెంబర్ 132. 142. 680 అమలు చేయడంతో పాటు టెండర్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలనే తదితర డిమాండ్ల సాధన కోసం జూలై 9న జరిగే సమ్మెలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, పంచాయతీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కోటిపల్లి సత్యనారాయణ, వి.శివయ్య, గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, నీలాంబరం, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, ఆర్ధల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు సీపీఐ నేతల నివాళి



విశాలాంధ్ర- తాడేపల్లి : సీపీఐ సీనియర్ నాయకులు బండ్లమూడి రాంబాబు ఈ నెల 11న అనా రోగ్య కార ణంతో కన్నుమూశారు. వారి పెద్దకర్మ ఎంటీ ఎంసీ పరిధిలోని పెనుమాక వారి నివాసం వద్ద జరిగింది. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, చేనేత రాష్ట్ర నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహన్‌రావు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి శివాజీ, వీరాస్వామి, ముసునూర్ శివ శంకరరావు, సీపీఐ నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, ముసునూర్ సుహాస్, జాలాది జాన్ బాబు, బొర్రా మల్లి కార్జునరావు, షేక్ మదీనా, గుంటక సాంబిరెడ్డి, పంతగాని మరియాదాసు, సీపీఎం నాయకులు ఎర్రపిరు, బీజేపీ నాయకులు పాతూరు నాగభూషణం, టీడీపీ నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జంగాల సాంబశివరావు, కొల్లి శేషు, పాలెపు వీరేంద్ర నాథ్(బాబీ), పలువురు నాయకులు పాల్గొని బండ్లమూడి రాంబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బదిలీలకు అవకాశం కల్పించాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: రిటైర్డ్ కార్మికుల స్థానంలో బదిలీలకు అవకాశం కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరపాలక సంస్థ గ్రీవెన్స్ నందు డీసీ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ వర్కర్లను 60 సంవత్సరాల పేరుతో రిటైర్డ్ చేసిన కార్మికుల స్థానంలో ఇప్పటివరకు పనిచేస్తున్న బదిలీ కార్మికు లను పూర్తి కాలపు ఆప్కాస్ కార్మికులుగా మార్చా లని, అలాగే నగర జనాభాకు అనుగుణంగా కార్మిక సంఖ్యను పెంచి బదిలీ వర్కర్లతో పాటు మిగిలిన వారిని కోవిడ్ కాలంలో పనిచేసిన వర్కర్లకు అవకాశం కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తూ చనిపోయిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించుటకు గాను సుమారు 22 మంది లిఫ్ట్ చేయడం జరిగిందని, వెంటనే విధుల్లోకి తీసుకొని వారి కుటుంబాలను ఆదుకోవడంతో పాటు పారిశుద్ధ కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని కోరారు. అధికారులు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు వసూళ్లల్లో ఎక్కడ నిబంధనలు పాటించటం లేదని, చట్ట ప్రకారం వసూలు చేయటం లేదని ఏఐవైఎఫ్, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్, మండల విద్యాశాఖ అధికారిణి వీవీ ఎస్ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, జీవో నెంబర్ 53, 54 నిబంధనలను ప్రైవేట్ పాఠశాలలు ఉల్లంఘిస్తున్నారని వెల్లడించారు. కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల బదిలీ ధ్రువీకరణ పత్రం(టీసీ)పై అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడ మైదానాలు, కనీస సౌకర్యాలు, లైబ్రరీలు లేవని, నిబంధనలు పాటించని సంస్థలకు అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జర్నలిస్టు విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇవ్వాలని జీవో జారీ చేసినప్పటికీ పాఠశాల యాజమాన్యాలు స్పందించటం లేదని, అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బి.శ్రీను నాయక్, ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవుల రాంబాబు, ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేష్, మల్లికార్జున్, రాంబాబు నాయక్, నాయకులు పుట్టా వెంకట బుల్లో డు, చలికినీడి నాగరాజు, డి.గోపి నాయక్, ప్రసాద్ నాయక్, శీను నాయక్, కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల సీపీఐ కార్యదర్శిగా కేతావత్ రంగనాయకులు

విశాలాంధ్ర- రెంటచిం తల: మండ ల సీపీఐ నూతన కార్యదర్శిగా పాత పాలువాయి గ్రామానికి చెందిన కేతావత్ రంగనాయకులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకల శ్రీనివా సరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శిగా దేరంగుల శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యులుగా చేపూరి శ్రీనివాసరావు, యేలూరి నాగార్జున, మామిడి లాజరు, అమరారావు సామేలుజాన్, ముళ్ల పాపయ్య, గొడుగు పూర్ణచంద్ర రావు, తుమ్మా సంజీవరావులను ఎన్నుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రంగనాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేసి నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

హార్మోన్ల అసమతుల్యత వల్లే అనారోగ్య సమస్యలు

ఆరోగ్య సభలో డాక్టర్ ఉమా మహేశ్వరరావు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతినటం వలన అనారోగ్య సమస్యలు ప్రభలుతాయని కిమ్స్ శిఖర హాస్పిటల్ వైద్యులు, ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జి.ఉమా మహేశ్వరరావు అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధుల'పై ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా మహేశ్వరరావు శరీరంలో జరిగే అన్ని క్రియలకు హార్మోన్ల అవసరం ఎంత కీలకమో ఆరోగ్యాభిలాషులందరికీ వివరించారు. నేడు మనం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన అనారోగ్య సమస్యలలో మధుమేహం ఒకటని, ఇది మన పాంక్రియాస్‌లోని క్లోమ గ్రంధి విడుదల చేసే ఇన్సులిన్ లోపం వలన వస్తుందన్నారు. మధుమేహం వలన మన శరీరంలో నరాలు దెబ్బతిని నెఫ్రోపతి, కార్డియోమయోపతి, న్యూరోపతి, రెటినోపతి తదితర సమస్యలు తలెత్తుతున్నాయని, షుగర్ వ్యాధికి గురైన వారిలో వివిధ రకాల చర్మ వ్యాధులు, సంసారానికి సంబంధించిన సమస్యలు...ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు షుగర్ వ్యాధితో ఇబ్బంది పడేవారు వ్యాధి నిరోధక శక్తి కోల్పోయి అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. థైరాక్సిన్ హార్మోన్‌లో అసమతుల్యత వల్ల థైరాయిడ్ సమస్య వస్తుందని ఆయన అన్నారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, టి.సుబ్బారావు,చల్లా అంజిరెడ్డి, చంద్రశేఖరరావు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత



విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగం గా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీ యూ న్యూ నాయకులు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె.శకుంతలను కలిసి అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమ్మె నోటీసులను అందజేశారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధా నాలను అవలంభిస్తుందని, మున్సిపల్ కార్మికులంతా సమ్మెలో పాల్గొనే విధంగా సమ్మె నోటీసు ఇచ్చామని కార్మిక సంఘా ల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, గండికోట దుర్గారావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, మున్సిపల్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, వై.శివ నాగేశ్వరావు, శంకర్రావు, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించినందున ఆగస్టు లోపు పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానంలో పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీయూ వారు మాట్లాడుతూ మే నెలలో జరిగిన పదోన్నతులలో మే నెల వరకు ఆయన ఖాళీలలో సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, డీఎస్సీ నియామకానికి ముందు ఆగస్టు వరకు ఉన్న వేకెన్సీలన్నీ పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలు లేక కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులు క్లస్టర్ వేకెన్సీలో కోరుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.జయప్రకాష్, నాదెండ్ల మండల అధ్యక్షుడు మక్బూల్ బాషా, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎడ్లపాడు మండల అధ్యక్షుడు జి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంతరవి, చిలకలూరిపేట మండల ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి. సీనియర్ నాయకులు చావల మల్లేశ్వరరావు, జిల్లా మహిళా కన్వీనర్ ఎం.శారద తదితరులు పాల్గొన్నారు.

400వ షోరూంను ప్రారంభించిన మలబార్ గోల్డ్ & డైమండ్స్

విశాలాంధ్ర- విజయవాడ (లబ్బీపేట) : ప్రపంచంలోనే అతి పెద్ద రిటైల్ ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ %ు% డైమండ్స్, తమ 400వ షోరూంను నోయిడాలో ప్రారంభించినట్లు గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మలబార్, తమ బ్రాండ్ ఆదాయాన్ని 78,000 కోట్ల రుపాయలకు పెంచాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 దేశాలు భారత దేశంలోని 22 రాష్ట్రాలు మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలు తమ ఉనికిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ షోరూము ప్రారంభోత్సవం సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ, "నోయిడా లో మా 400వ షోరూమ్‌ను ప్రారంభించడం పట్ల మేము చాలా సంతోషంగా ఉన్నామన్నారు. ఈ మైలురాయి మా వృద్ధి ఆశయాలకు నిదర్శనమన్నారు. భారతదేశం, ప్రపంచ వ్యాప్తంగా నంబర్ 1 గ్లోబల్ జ్యువెలరీ రిటైలర్గా పేరుగాం చాలంటే మా ప్రయాణంలో నిరంతరం విస్తరిస్తున్న మా అడుగుజాడలను సూచిస్తుందన్నారు. మా లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రముఖ పాత్ర పోషించిన మా కస్టమర్‌లు, నిర్వహణ బృందం సభ్యులు, వాటాదారులు మరియు ఇతర స్టేక్ హెూల్డర్స్ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్తున్నానన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60 కొత్త షోరూమ్‌లు తయారీ యూనిట్లను స్థాపించడం రూ.78,000 కోట్ల టర్నోవర్ను సాధించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

పేద మధ్య తరగతి ప్రజలకు రియల్ ఎస్టేట్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యం

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : పేద మధ్య తరగతి ప్రజలకు రియల్ ఎస్టేట్ పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా తాము సర్వీసు సెంటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని టైలర్ మేడ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండర్ మేనేజింగ్ డైరెక్టర్ రఘు బర్ల, శీరిష బర్లలు తెలిపారు. ప్రాపర్టీ కొనాలనుకునే వారు మా ఎక్సపర్ట్స్ ని సంప్రదించి రిక్వైర్మెంట్స్ తెలిపితే కోరిన విధంగా ప్రాపర్టీస్ ని అందిస్తామన్నారు. రియల్ ఎస్టేట్ చరిత్రలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ మొట్ట మొదటి సారిగా రియల్ ఎస్టేట్ సర్వీస్ సెంటర్ ను

విజయవాడ బి ఆర్ టి ఎస్ రోడ్డు పలగాని ప్రభాకర్ విగ్రహం సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా టైలర్ మేడ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రఘు బర్ల, మాట్లాడుతూ సామాన్య మధ్య తరగతి ప్రజలకు రియల్ ఎస్టేట్ పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా తాము ఈ సర్వీసు సెంటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టే విధంగా ప్రోత్సాహిస్తూ ప్రతి ఒక్కరికి రియల్ ఎస్టేట్ ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ప్రాపర్టీ ఎక్సపర్ట్స్ యొక్క సలహాను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రాపర్టీ కొనాలనుకునే వారు ఒక్కసారి మా ఎక్సపర్ట్స్ ని సంప్రదించి వారి రిక్వైర్మెంట్స్ ని తెలిపితే కోరిన విధంగా టైలర్ మేడ్ ప్రాపర్టీస్ ని అందిస్తామన్నారు.

కొత్త శాఖలను ప్రారంభించిన బంధన్ బ్యాంక్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అయిదు శాఖలను ప్రారంభించినట్లు బంధన్ బ్యాంకు వెల్లడించింది. అలాగే జార?ండ్‌లో ఏడు శాఖలు, ఒడిషా మరియు బీహార్‌లో చెరి మూడు శాఖలు చొప్పున 4 రాష్ట్రాల్లో మొత్తం 18 కొత్త శాఖలను బ్యాంకు ప్రారంభించింది. ఇతర బ్యాంక్ సీనియర్ అధికారులతో కలిసి బంధన్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో ఎంఆర్. పార్థ ప్రతిమ్ సేన్‌గుప్తా, ఈడీ సీబీవో ఎంఆర్. రాజీందర్ కుమార్ బబ్బర్, ఈడీ అండ్ సీవోవో ఎంఆర్. రతన్ కుమార్ కేశ్ బ్రాంచీలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం (నరసన్నపేట శాఖ, టెక్కలి శాఖ), కాకినాడ (పెద్దాపురం శాఖ), తూర్పు గోదావరి (దేవరపల్లి శాఖ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ (రామచంద్రాపురం శాఖ)లో ఈ కొత్త శాఖలు ఏర్పాటయ్యాయి. ఈ శాఖలన్నీ రాష్ట్రంలోని సెమీ-అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు తోడ్పడనున్నాయి.

నీటి నిల్వ సామర్థ్యానికి పూడిక తొలగింపు

- సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు నీరు
- బూరుగుల చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ గ్రామీణ మండలం నున్న గ్రామంలో ఉన్న బూరుగుల చెరువు నీటి వినియోగదారుల సంఘం చెరువు నీటిపారుదల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి పూడిక తొలగింపు పనులను ప్రారంభించింది. మే 12న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓఆర్‌టీ నంబర్ 203 ప్రకారం ఈ ప్రక్రియను చేపట్టినట్లు నీటి సంఘం మూలగోళ్ల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం నున్నలో సంఘం ఉపాధ్యక్షుడు కె రమేష్, సభ్యుడు ఎస్ విశ్వేశ్వరరావు, ఇతర స్థానిక రైతులతో కలసి సుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడారు. వర్షాధార చెరువుపై పూర్తిగా ఆధారపడిన 300 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో, పూడిక తొలగింపును ప్రైవేటు వ్యక్తులు చేసేవారని ఆయన తెలిపారు. అయితే, పారదర్శకతను నిర్ధారించడానికి, అక్రమాలను నివారించడానికి, ప్రస్తుత ఆపరేషన్ ను జలవనరులు, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. బూరుగుల చెరువు కింద ఆయకట్టు కేవలం వర్షపాతంపైనే ఆధారపడి ఉందని, కాలక్రమేణా, పూడిక పేరుకుపోవడం చెరువు నిల్వ సామర్థ్యాన్ని బాగా తగ్గిందని ఆయన తెలిపారు. ఫలితంగా పోలవరం కుడి ప్రధాన కాలువ నుండి పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా సరఫరా చేయబడిన నీరు కూడా నీటిపారుదల అవసరాలను తీర్చడానికి చాలడంలేదనినారు. ఈ పూడిక తొలగింపు పనులు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట రావు సహకారంతో జరుగుతున్నాయనిచ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇదిలావుండగా, చెరువులో తీసిన పూడిక మట్టిని వ్యవసాయ పొలాలను మరింత సారవంతం చేసేందుకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో నిరుపేదల ఇళ్ల స్థలాలను మెరక చేసుకునేందుకు కూడా రవాణా చేస్తున్నామని చెప్పారు. అయితే, చెరువు మట్టిని ఎట్టి పరిస్థితిలోనూ ఇతర ప్రాంతాలకు రవాణా చేయడంలేదని స్పష్టం చేశారు. నీటిపారుదల అధికారులు, భూయజమానుల పర్యవేక్షణలో మొత్తం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది, దుర్వినియోగం లేదా అవినీతికి అవకాశం లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే పలు మత సంఘాలు తమ శ్మశాన వాటికలను మెరక చేసుకునేందుకు మట్టిని సరపరా చేయాలని అభ్యర్థించాయని, అది కూడా నిబంధనల ప్రకారం సహకారం అందిస్తున్నామని తెలిపారు. మట్టి త్వకంతోపాటు చెరువు నిర్వహణ కోసమే తాము నామమాత్రంగా రుసుం వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదిలావుండగా, పూడిక తీయడంతో పాటు, పొలాల నుండి వరి ఉత్పత్తులను సులభంగా రవాణా చేయడానికి చెరువు గట్లను బలోపేతం చేస్తున్నట్లు సుబ్బారెడ్డి అన్నారు. సిల్ట్ తవ్వకం సమయంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు జంగమవాని చెరువు కట్ట గతేడాది వరదకు కోతకు గురైందని, దానిని బలోపేతం చేసేందుకు కూడా మట్టిని వినియోగిస్తున్నట్లు సుబ్బారెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో టిడిపి అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాదు శివ రామప్రసాద్ పాల్గొన్నారు.

వితంతువులకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం పురస్కరించుకుని జయహో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వితంతువులకు చీరల పంపిణీ చేశారు. ప్రెసిడెంట్ కొల్లా జయశ్రీ సుమారు 10 మంది వితంతువులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది జూం 23వతేదీన అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం జరుపుకుంటామన్నారు. అలాగే ట్రాఫిక్ పై అవగాహన, మజ్జిగ పంపిణీ, ఫాదర్స్ డే తదితర కార్యక్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్.రమాదేవి, సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

మహిళా తారకరామ వాకర్స్ క్లబ్ సభ్యుల ఎన్నిక

విశాలాంధ్ర-గుడివాడ : తారకరామ తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ నూతన కమిటిని తారకరామ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య అధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం అవరణలో ఎన్నుకున్నరు. వాకర్ ఇంటర్నేషనల్ 2004 జిల్లా గవర్నర్ సనక సుబ్బారావు నూతన కమిటి అధ్యక్షురాలుగా యార్లగడ్డ సుధారాణి, కార్యదర్శిగా పిల్లి సునీత, కోశాధికారిగా వీరమాచినేని శైలజలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రెటరీ కిలారపు రంగప్రసాద్, కమిటి జిల్లా కార్యదర్శి చిన్నం గంగాధరరావు, జోన్ చైర్మన్ సయ్యద్ మహబూబ్‌అలీ, సభ్యులు దర్శి వెంకటసత్యనారాయణ, తమ్మినేని రామమోహన్‌రావు, కేదారి రాఘవయ్య, పుట్టి సతీష్‌కుమార్, పి.సూరిబాబు, చలువాది వెంకటమోహన్‌రావు, బచ్చు రాధాకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో సాయిమేధా ఉత్తమ ఫలితాలు

విశాలాంధ్ర-విజయవాడ: పాలిటెక్నిక్ 4వ సెమిస్టర్‌లో విజయవాడ సాయిమేధా విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. కె.వి.ఎస్ చక్రి అనే విద్యార్థి 1000 మార్కులకు గాను 987, భార్గవ్ 984, అజిత్ ప్రకాష్ 966, వై. గురుపావని 94.9 శాతం , పి. వైష్ణవి 944, ప్రశాంత్ 926 మార్కులు, ఏ వర్షిత 82.9శాతం, టి. శ్వేతా 87.9 శాతం, వై. స్నేహ 81 శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా సాయి మేధా కోచింగ్ సెంటర్ విజయవాడ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతు చైర్మన్ జి. రమణ సారధ్యంలో సాయి మేధా కోచింగ్ సెంటర్ ద్వారా అనేక మంది విద్యార్థులను ఈసెట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దామని చెప్పారు. తమ విద్యార్థులు 4వ సెమిస్టర్‌లో మంచి మార్కులు సాధించడం తమకు ఎంతో గర్వకారణం అన్నారు. అలాగే వచ్చే సంవత్సరం జరిగే ఈసెట్‌లో కూడా మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛ చల్లపల్లితో పర్యావరణ పరిరక్షణ మొక్కలు నాటిన తహసీల్దార్, ఎంపీడీవోలు

విశాలాంధ్ర-చల్లపల్లి : స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం ద్వారా చల్లపల్లి పరిసర గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి జరుగుతోందని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఎవి.రమణలు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ చల్లపల్లి సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం జాతీయ రహదారి వెంబడి మె ఎక్కలు నాటారు. హైవేపై స్వచ్ఛ చల్లపల్లి బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడుతూ, పదేళ్లు పూర్తిచేసుకున్న స్వచ్ఛఉద్యమం ద్వారా 30 వేల పైచిలుకు మొక్కలు నాటటం అసామాన్యమని కొనియాడారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతిల నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు శ్రమిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమన్నారు. జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దిన వైనాన్ని తహసీల్దార్, ఎంపీడీవోలు చూసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛచల్లపల్లి సారధి డాక్టర్ డిఆర్కె.ప్రసాద్, పం చాయతీ కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్, ప్రాతూరి ఉదయశం కర శాస్త్రి, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, స్వచ్ఛ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.